
**రాజధానీ** నగరంలో కళాభవన్.

ఈ కళాభవన్‌లో బాలల చిత్రాలు ప్రదర్శించబడుతున్నాయి నాలుగు రోజులుగా. ఈ చిత్రాలను చూడడానికి పిల్లలూ, పెద్దలూ, యువకులూ, వృద్ధులూ అని లేకుండా అన్ని తరగతుల వారూ, అన్ని వయసుల వారూ వచ్చి చూస్తున్నారు. చూసి ఆనందిస్తున్నారు. పూర్ణిమా ఆమె భర్త శివకుమార్ తమ ఇద్దరు పిల్లలనీ ఈ చిత్రాలు చూపించడానికి తీసుకువచ్చారు. ఎనిమిదేళ్ళ బిందూ, ఆరేళ్ళ విష్ణూ చిత్రాలను హుషారుగా చూశారు. చూసి తల్లిదండ్రుల చేతులు పట్టుకుని హాలులోనుంచి వరండాలోకి వచ్చారు.

"పూర్ణిమా..ఏయ్! నువ్వూ ఈ ఊళ్ళో ఉంటున్నావా?" దాదాపు ముప్పై ఏళ్ళ ఆమె అమాంతం వచ్చి పూర్ణిమను వాటేసుకుని ప్రశ్నలు గుప్పించసాగింది.

"ఎక్కడో ప్రాజెక్టులో ఉన్న నువ్వు ఎప్పుడొచ్చావ్?"

పూర్ణిమ సూర్యముఖిని పరిశీలనగా చూస్తూ జవాబు చెప్పడం మరిచిపోయింది. సన్నగా ఉండే సూర్యముఖి లావుగా తయారైంది. అసలే కాస్త ఎత్తు తక్కువ. కాలేజీ రోజుల్లో చామనఛాయగా ఉండేది. ఇప్పుడు మంచి రంగు వచ్చి మిసమిసలాడిపోతూ ఉంది. అందమైన షిఫాన్ జార్జెట్



చీర సూర్యముఖి వంటినుంచి జారిపోతున్నట్లుగా ఉంది. హెయిర్ స్టైయిల్ కూడా గమ్మత్తుగా మార్చేసింది. అసలు చిన్నప్పుడు అంటే డిగ్రీ చదివే రోజుల్లో తమిద్దరూ మూడు సంవత్సరాలు కలిసి చదువు సాగించారు. అప్పుడు సూర్యముఖి సామాన్య సంసారుల ఆడపిల్ల. అయితే చదువులో ఎప్పుడూ ఫస్ట ఉండేది.

తమ ఇద్దరి స్నేహం డిగ్రీ పూర్తి అవడంతో ముగిసిపోయింది. సూర్యముఖి తండ్రి పోవడం, అన్నగారి దగ్గరకు ఆమె వెళ్ళడం జరిగింది. తర్వాత చాలా రోజులు ఉత్తరాలు రాస్తూ ఉండేది. పెళ్ళి అయినట్లు, శ్రీమంతుడైన భర్త దొరికినట్లు రాసింది. అంతే! ఆ తర్వాత ఇద్దరి మధ్యా ఉత్తర ప్రత్యుత్తరాలు లేవు. అందుకే పూర్ణిమ సూర్యముఖిని పరీక్షగా చూస్తూ కాలేజీ రోజులు గుర్తు చేసుకుంటూ రెండు నిమిషాలు తనని తను మరచిపోయింది.

"ఏయ్! నా ప్రశ్నలకు జవాబివ్వకుండా ఏమిటోయ్, ఆ పరధ్యాన?" పూర్ణిమని కుదిపి అడిగింది సూర్యముఖి.

"ఆఁ...ఆఁ...ఇస్తాను జవాబు. ఉండు ఒక్క క్షణం. అన్నట్లు ఏ ప్రశ్నకు జవాబివ్వను ముందు."

"మీ ఆయన ఏం చేస్తున్నాడు?"

"ఉద్యోగం చేస్తున్నాడు."

"ఏం ఉద్యోగం?"

"దీపాలు వెలిగించే ఉద్యోగం."

"అంటే?"

"కరెంటు ఆఫీసులో."



అతనికి నా అనే వాళ్ళు లేరు. అలాగే ఆస్తిపాస్తులూ లేవు. తనకు డబ్బు బాగా ఉన్న భర్త కావాలి. అందుకే ఇతన్ని అప్పుడు తిరస్కరించింది.

"గుర్తు పట్టారా!" అన్నట్లు చూసింది శివకుమార్ వైపు.

అతని ముఖంలో ఏ భావమూ కనిపించలేదు.

"పూర్ణా, వెడదామా?" అన్నాడు.

అతని గొంతు వినసొంపుగా ఉంది. మళ్ళా మళ్ళా వినాలని అన్పించేలా ఉంది.

"అప్పుడేనా? కాస్త ఉండండి. సూర్యముఖితో కాస్సేపు మట్లాడి వస్తాను" అంటూ సూర్యముఖి వివరాలు తెలుసుకోవడంలో మునిగిపోయింది.

"మాఆయన పెద్ద కాంట్రాక్టర్! ఓ రెండంతస్తుల మేడ ఉంది. ఓ పెద్ద కారుంది. ఇంకా వివరాలు దాటే ప్రయత్నంలో ఉన్నారు. రోడ్డుమీద వచ్చే పోయే వాహనాలను తప్పించుకుంటూ అతను నడుస్తూంటే అతన్ని అంటిపెట్టుకున్నట్టుగా అనుసరిస్తోంది పూర్ణిమ. వారు ఎంత జాగ్రత్తగా రోడ్డు దాటుతున్నా ఎడం పక్కనుంచి ఓ ఫియట్ కారు సర్రున రానే వచ్చేసింది. శివకుమార్ భార్య భుజం పట్టుకుని చప్పున ముందుకు లాక్కున్నాడు. లేకుంటే ఏం జరిగేదో చెప్పనక్కరలేదు. క్షణంలో సగం భయంతో కంపించిన సూర్యముఖి 'అమ్మయ్య' అనుకుంది. అతను భార్యనీ, పిల్లలనీ రోడ్డు దాటించి అటుగా వెళ్ళే ఆటోని ఆపి ఎక్కేశాడు.

వాళ్ళు వెళ్ళినా ఇంకా రోడ్డువైపే చూస్తూ నిల్చున్న సూర్యముఖిని స్నేహితులు హెచ్చరించారు.

# అర్ధాంగి

## గోవిందరాజు సీతాదేవి

"అంటే?"

"ఓ చిన్న అసిస్టెంట్ ఇంజనీర్."

"ఏమిటీ ఇంజనీర్ని పెళ్ళాడావా?"

"నేను కాదు. ఆయన నన్ను పెళ్ళాడారు."

"ఏడీ పరిచయం చెయ్యి."

"ఏమండీ, ఏమండోయ్!" పూర్ణిమ పిలుపుకి కాస్త దూరంగా నిలుచుని పిల్ల లిద్దరితో కాలక్షేపం చేస్తున్న శివకుమార్ తలెత్తి చూశాడు.

"ఇలా రండి."

శివకుమార్ వస్తున్నాడు. అందంగా, ఆరోగ్యంగా ఆరడుగుల ఎత్తున హుందాగా ఉన్న శివకుమార్ నడకలోనూ ఓ విధమైన ఠీవి కన్పిస్తూంటే సూర్యముఖి అతన్ని కన్నార్పకుండా చూడసాగింది. అతన్ని ఎప్పుడో, ఎక్కడో చూసినట్లుగా అనిపించి గుర్తుకు తెచ్చుకొనే ప్రయత్నం చేస్తూండగా పూర్ణిమ పరిచయం చేసింది.

"ఇరుగోనే మాశ్రీవారు! పేరు శివకుమార్! ఇది నా ఫ్రెండ్ సూర్యముఖి అండీ!"

"నమస్కారం." శివకుమార్ చేతులు జోడించాడు. ఆ నిలుచుని నమస్కారం చేస్తున్న తీరు అచ్చంగా...అతను ఇతనే! ఇతనే పదేళ్ళ క్రితం పెళ్ళికొడుగ్గా తనని చూడడానికి వచ్చాడు. వచ్చి చూసి వెళ్ళిపోతూ చెప్పాడు.

"మీ అమ్మాయి నాకు నచ్చింది. నేను మీ అమ్మాయికి నచ్చితే కబురు చేయండి" అంటూ. ఇలాగే 'నమస్కారం' అని సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

శివకుమార్ మటలకు తన తల్లిదండ్రులు ఎగిరి గంతేశారు. కానీ, తను ఆలోచించసాగింది.

కావాలంటే మాఇంటికి రా చెప్తాను. అన్నట్లు ఇరుగో ఈ ముగ్గురూ నా ఫ్రెండ్స్!" అంటూ పరిచయం చేసింది తన వెంట ఉన్న యువతులను.

వాళ్ళు అచ్చంగా సూర్యముఖిలానే అలంకరించుకుని ఉన్నారు.

పూర్ణిమ వారితో కబుర్లు చెప్పసాగింది.

సూర్యముఖి శివకుమార్‌ను తదేకంగా చూడసాగింది. వైట్ టెరీకాట్ పాంటూ, బ్లూ కలర్ స్లాక్ షర్టూ, ఎడం చేతికి నల్ల బెల్టు రిష్టు వాచీతో చాలా సాదాగా కనిపిస్తున్నా అతని విశాలమైన నుదురూ, ఎత్తయిన క్రాపూ, పెద్ద పెద్ద కళ్ళూ చూస్తుంటే ఇంకా ఇంకా చూడాలనిపించే అందం అనిపించింది సూర్యముఖికి.

"ఇది నా ఫ్రెండ్, సూర్యముఖి" అని పూర్ణిమ పరిచయం చేస్తున్నప్పుడు ఒకే ఒక్కసారి చూశాడు తన ముఖంలోకి నిశితంగా పరిశీలిస్తున్నట్లుగా. ఒకే ఒక్క క్షణం అంతే. మరి చూడలేదు. పూర్ణిమ కబుర్లు ఎంతకీ పూర్తికాకుంటే శివకుమార్ హెచ్చరించాడు.

అంతే పూర్ణిమ అందరి దగ్గరా సెలవు తీసుకుంది. సూర్యముఖి దగ్గర ఆమె ఇంటి అడ్రెస్ తీసుకుంది. తన అడ్రెస్ ఇచ్చి "వస్తాం" అంది.

"ఆగు. మాకారులో దింపేస్తాం" అంది సూర్యముఖి.

"ఒద్దు. శ్రీవారికి కొన్ని కొన్ని విషయాలు నరిపడవు. నండే తప్పక మాఇంటికి రా, సూర్యం!" అంటూ పిలిచింది.

"నేను కాదు. నువ్వూ, మీ శ్రీవారూ రండి. ఊరికే కాదు, భోజనానికి! పదకొండుకు వచ్చేయండి."

"సరే!" పూర్ణిమ భర్తతో కలిసి వెళ్ళిపోతూంటే సూర్యముఖి అలాగే నిలబడి చూడసాగింది. భార్యాభర్త లిద్దరూ చెరో పిల్లనీ చేయి పట్టుకుని రోడ్డు

"పదండి లోపలికి పోదాం."

సూర్యముఖి కదల్లేదు. మరోసారి హెచ్చరించారు స్నేహితులు.

"వద్దు. నాకు తలనొప్పి వచ్చేసింది" అని వెనక్కి తిరిగింది.

వాళ్ళ ముఖాల్లో విసుగు చోటుచేసుకుంది.

"ఇంత దూరం వచ్చి వెనక్కి వెళ్ళడమా!" వినీ విన్పించనట్లుగా అనుకుని పైకి అన్నారు.

"పోనీ అలా వెళ్ళి కాఫీ తాగుదామా!"

"వద్దు" అంటూ కారువైపుగా నడవసాగింది.

సూర్యముఖిని చూస్తూనే డ్రైవర్ పరుగెత్తుకు వచ్చాడు.

కారులో కూర్చుని "ఇంటికి పోనీయ్" అంది.

రాహువుల్లా ఎదురై ప్రోగ్రాం అంతా పాడు చేశారు వెధవ స్నేహితురాలూ, ఆవిడ మొగుడూ. అయినా వాళ్ళని చూసి ఈవిడ ఇంతగా మతి చెడగొట్టుకోవడం ఏమిటీ! మనసుల్లో తిట్టుకోసాగారు సూర్యముఖి స్నేహితురాళ్ళు. అయినా ఈవిడ కిలా చేయటం అలవాటే అనుకుని సమాధానపడ్డారు కొంత సేపు అయిన తర్వాత. సూర్యముఖి ఇంటి నుంచి వచ్చే టప్పుడు, ఎంత హుషారుగా ఉందో, వెళ్ళేప్పుడు అంత ముభావంగా ఉంది. ఎవరూ ఎవరితోనూ మాట్లాడకుండానే కారు స్పీడుగా పోసాగింది.

### 2

ఆదివారం రానే వచ్చింది.

పూర్ణిమ త్వరత్వరగా పని ముగించుకోసాగింది. శివకుమార్ వాలుకుర్చీలో కూర్చుని టీ.వీ. చూస్తూంటే పూర్ణిమ అతని దగ్గరగా వచ్చింది.

"మీకు వంట చేసి డైనింగ్ టేబిల్ మీద పెడతాను" అంది.

అతను జవాబు చెప్పలేదు.

"ఏం కూర చేయను."

"ఏం వద్దు. నీ ఫ్రెండ్ ఇంటికి నేనూ వస్తాను. రెడీ అవు."

పూర్ణిమకి ఆశ్చర్యం, సంతోషం ఒక్కుమ్మడిగా వచ్చేశాయి. ఎక్కడికీ ఎక్కువగా రాని భర్త తనంత తానుగా సూర్యముఖి ఇంటికి వస్తాననటం చిత్రంగా అనిపించింది.

"నిజంగా వస్తారు కదూ" అంది ఇంకా నమ్మకం కుదరక.

భార్య ముఖంలోకి చూసి నవ్వాడు అంగీకారంగా.

పూర్ణిమకి ఏను గెక్కినంత సంతోషంగా ఉంది. భర్తతో కలిసి వెళ్ళటం చాలా సరదా. అది చాలా తక్కువగా తీరుతూ ఉంటుంది. అందుకని పిల్లలని ముస్తాబు కమ్మని తనూ తయారైపోయింది. పది గంటలు దాటిన తర్వాత శివకుమార్ భార్యనీ, పిల్లలనీ తీసుకుని బయలుదేరాడు స్కూటర్‌లో.

బంజారా హిల్స్‌లో ఉన్న సూర్యముఖి ఇల్లు తేలిగ్గానే తెలుసుకున్నారు. చుట్టూ ప్రహరీగోడ, చక్కటి గార్డెనూ, మధ్యలో అందమైన బంగళా. ఆర్భాటంగా కన్పిస్తోంది. స్కూటర్ శబ్దం విని గూర్ఖా గేటు తెరిచాడు. పనిపిల్ల వచ్చి తీసుకువెళ్ళి హాలులో కూర్చోపెట్టింది. హాలు మెత్తని తివాచీ సోఫాలతో ఆధునాతన అలంకరణతో ఆర్భాటంగా ఉంది.

సూర్యముఖి ఎంతకీ బైటకి రావటం లేదు. పూర్ణిమకి ఇది నచ్చలేదు. సరాసరి స్నేహితురాలితో లోపలికి వెళ్ళిపోయి హాయిగా ఇల్లంతా తిరుగుతూ, కబుర్లు చెప్పుకోవచ్చు ననుకుంది. ఆమె భర్తని తన భర్తకి పరిచయం చేసేస్తే వాళ్ళిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ ఉంటారు అనుకుంది. కానీ, ఇక్కడ అలా జరగలేదు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఎక్కడా ఏ అలికిడీ లేనట్లుగా ఉంది.

శివకుమార్ ముఖం గంభీరంగా ఉంది.

ఇంతలో మెత్తగా అడుగులు వేస్తూ రాజహంసలా నడిచి వచ్చింది సూర్యముఖి. అప్పుడే మేకప్ పూర్తి చేసుకున్నందువల్ల ముఖం గమ్మత్తుగా మెరుస్తోంది. తెల్లటి షిఫాన్ జార్జి మీద జరీ పువ్వుల ఎంబ్రాయిడరీ. స్లీవ్‌లెస్ జాకెట్. మెడలో ముత్యాల హారం పొడుగ్గా వేలాడుతూ ఉంది.

"నమస్కారం" అంది శివకుమార్‌కి ఎదురుగా వచ్చి కూర్చుంటూ.

"నమస్కారం" జవాబిచ్చాడు.

పూర్ణిమకి చికాకు వచ్చేసింది.

"మీ ఆయ నేడీ పిలువు" అంది.

"ఆయనా... ఆయన లేరు. ఏదో పనిమీద బైటకి వెళ్ళారు. రాత్రికి గానీ రారు."

"చంపావు, పో! రాకరాక మా ఆయన వస్తే..." విసుగ్గా చూసింది పూర్ణిమ.

"ఆయనగారు లేకుంటే ఏం? నే లేనూ! అవునూ, కాఫీ తాగుతారా?"

"ఏం వద్దుగానీ నన్ను పరాయిదానిలా ఇలా హాలులో బంధించావేమిటి. పద లోపల మీ ఇల్లాంతా చూస్తాను."

"నువ్వు ఒక్కదానివేనా! వద్దు. ఇద్దరూ రండి. పిల్లలూ, మీరూ రండి" అంటూ ఇల్లంతా తిప్పి చూపించింది.

పది లక్షలకి తక్కువ ఖరీదు ఉండదు మనసులోనే అంచనా వేశాడు శివకుమార్. తిరిగి వచ్చి హాలులో కూర్చున్నారు.

శివకుమార్‌కి అనీజీగా ఉంది. ఆడవాళ్ళ కబుర్లు వింటూ అతను ఎక్కువ సేపు కూర్చోలేకపోతున్నాడు. సూర్యముఖి ఎంతగా అతణ్ణి మాటల్లోకి దింపాలని చూసినా లాభంలేకపోతూ ఉంది. ఓ ఇంగ్లీషు పుస్తకం తీసుకుని చదవడంలో మునిగిపోయాడు.

కబుర్లు అయిన తర్వాత డైనింగ్ హాల్లోకి తీసుకువెళ్ళింది సూర్యముఖి. అక్కడ ఆర్భాటంగా ఏర్పాటు చేసిన భోజనం. స్వీట్లు వగైరా చూసి పిల్ల లిద్దరూ సంబరపడ్డారు.

"అయ్యబాబోయ్! ఇన్ని వంటలా!" అంది పూర్ణిమ.

"భయపడకు. కూర్చో. మా ఇంటికి ఎవర్ని పిలిచినా ఇలాగే చేయిస్తాను." ఆ అనటంలో గర్వం కన్పిస్తోంది.

"నేను నిన్ను పిలుస్తాను కానీ, ఇలా మాత్రం చేయను. చేయలేను."

"నాకు తెలుసు. కలకత్తా హేండ్లూమ్ చీరెలో బయటికి వచ్చే నువ్వు..." అంటూ చిన్నగా నవ్వేసింది.

శివకుమార్ ఈ మాట విన్నాడు. అతని కనుబొమలు ముడుచుకున్నాయి. ఇది గ్రహించింది పూర్ణిమ. కాస్త భయపడింది. వెంటనే—

"నా కిలాంటి చీర లంటేనే ఇష్టం. మా శ్రీవారికి మరీ ఇష్టం" అంటూ మాట మార్చేసింది.

'అబ్బో అదేం టేస్టు బాబూ' అన్నట్లుగా శివకుమార్‌వైపు చూసింది. అతను ఆమెవైపు చూడలేదు.

ఎలాగో ఒక గంటవరకూ ఉండి ఇంటికి వచ్చేశారు.

పిల్ల లిద్దరూ ఇంటికి వచ్చినా ఆంటీ ఇంటి విషయాలే చెప్పుకోసాగారు.

పూర్ణిమ వస్తూ వస్తూ మళ్ళీ ఆదివారం సూర్యముఖిని భర్తతో సహా తమ ఇంటికి రమ్మని మరీ మరీ చెప్పి వచ్చింది.

## 3

సూర్యముఖి పూర్ణిమ పిలిచినట్లుగా ఆదివారం వరకూ ఆగలేదు. బుధవారమే వచ్చేసింది- ఇద్దరు స్నేహితులని వెంట పెట్టుకుని. వస్తూనే ఇల్లంతా తిరిగి చూసి తిరిగి వచ్చి కుర్చీలో కూర్చుని అంది—

"చాలా ఆశాభంగం కల్గించావు పూర్ణిమా నీ ఇల్లు ఇలా ఉంటుంది అనుకోలేదు. నీవు కట్టుకునే హేండ్లూమ్ చీరెలు చూసి ఇంటిని అంచనా వెయ్యవచ్చు ననుకో. నీ భర్తది పెద్ద ఉద్యోగం కదా! రెండు చేతులా సంపాదిస్తూ ఉండే ఉద్యోగం కదా అని అనుకుని అంచనా వేసుకున్నాను."

ఈ మాటలు నచ్చలేదు పూర్ణిమకు.

"నా భర్త ఒక్క చేత్తో నిజాయితీగా తీసుకుంటారు జీతం. అందులో నేనూ, మా పిల్లలే కాదు ఆయన ఇద్దరు తమ్ముళ్ళని చదివిస్తున్నారు. ఓ చెల్లి పెళ్ళి చేశారు."

"అరెరె నీకిన్ని బాధ్యతలా పాపం." జాలి ఒలకబోసింది సూర్యముఖి.

"ఇందులో జాలిపడాల్సిందేం లేదు సూర్యం. ఆయన బాధ్యతల్ని సంతోషంగా పంచుకుంటున్నాను. ఇలా పంచుకోవటంలో కలిగే తృప్తి, ఆనందం బహుశా నీకు తెలిసి ఉండదు."

సూర్యముఖీ, ఆమె స్నేహితులూ ఒకరి ముఖాల్లోకి ఒకరు చూసుకు నవ్వుకున్నారు.

"పూర్ణిమా సినిమాకి పోదాం పద త్వరగా బయలుదేరు" అంది సూర్యముఖి అక్కడే వారపత్రిక అందుకుని చూస్తూ.

ఇప్పుడా! సినిమానా ఆలోచించసాగింది పూర్ణిమ.

"ఏం మీ శ్రీవారి ఆర్డర్ తీసుకుంటే గాని ఇల్లు కదలకూడదా?"

"అదేం లేదు. కాని పిల్లలు స్కూలు నుంచి వస్తే!"


"ఏం ఫర్లేదు" బలవంతం చేసింది సూర్యముఖి.

పూర్ణిమ బయలుదేరింది. టికెటు పూర్ణిమ తీసుకుంటానన్నా వినలేదు.

సినిమా పూర్తయిన తర్వాత హోటల్‌కి పోదాం అని లాక్కుపోయారు.

హోటల్ బిల్లు పూర్ణిమకి ఇచ్చారు.

దాదాపు ఎనభై రూపాయలు. పర్సులో అర్థవైకి మించి లేవు. తను ఈ హోటల్‌కి రావల్సి



వస్తుందని అనుకోలేదు. 'ఇప్పుడేం చేయాలి' పూర్ణిమకి అవమానంగా అన్పించసాగింది. సూర్యముఖీ, స్నేహితులూ కబుర్లు చెప్పుకుంటూ బయటికి నడుస్తున్నారు.

"సూర్యా" పిలవలేకపిలిచి అడిగింది- ఓ ఇరవై ఉంటే ఇవ్వు అని.

సూర్యముఖి గలగలా నవ్వింది. తనే పర్సు తెరిచి వంద కాయితం బిల్లు ఇస్తుంటే ఒద్దు అంది పూర్ణిమ. 'సరే అని నోటు తీసుకుని మిగతా డబ్బు ఇచ్చేసి బయటికి వచ్చేశారు. అంత ఖరీదైన హెూటల్‌కి పూర్ణిమ ఇంతవరకూ రాలేదు.

సూర్యముఖి కారులో పూర్ణిమని దించి 'లోపలికి రమ్మంటావా' అంటూ కారు దిగింది. శివకుమార్ పిల్లలిద్దరినీ కూర్చోపెట్టుకుని చదువు చెప్తున్నాడు.

వీరిని చూడగానే నవ్వుతూ పలకరించాడు. కాస్సేపు కబుర్లు చెప్పి వెళ్ళిపోయింది సూర్యముఖి స్నేహితురాళ్ళతో కలిసి.

సూర్యముఖి మరెప్పుడు పిల్చినా పూర్ణిమ ఆమెతో బయటికి వెళ్ళలేదు.

శివకుమార్ మేరెప్పుడూ సూర్యముఖి ఇంటికి వెళ్ళలేదు కానీ ఆమె భర్తని ఓసారి చూడాలన్న కోరిక అతని మనసులో అలాగే ఉండిపోయింది.

ఒక రోజు సూర్యముఖి పుట్టినరోజని పిల్చింది. చాలా అర్జంటుగా జరిగింది. అప్పుడూ లేదు ఆమె భర్త. కానీ ఆ పార్టీకి వచ్చిన వారిలో కోటీశ్వరురాలు అంబుజాక్షి ఉంది. సూర్యముఖి ఆవిడని మర్యాద చేయటంలో మునిగిపోయింది.

పూర్ణిమ ఇంటికి వచ్చి విసుక్కుంది.

"ఈ కాలంలో మనుషులు ఎంతకీ తమకంటే పై స్థితిలో ఉన్నవారిని చూస్తూ వారితో పరిచయాలు పెంచుకోవటంలో సరిపోతుంది."

"ఇది అంటు రోగంలా వ్యాపిస్తోంది పూర్ణా. అలాంటివారికి మనలాంటివారం దూరంగా ఉండటం మంచిది."

సూర్యముఖి కొత్తలో ఎన్నిసార్లు వచ్చిందో తర్వాత తర్వాత అంతగా రావటం తగ్గించేసింది. పూర్ణిమకు ఇది చాలా బాధ కలిగించింది.

4

ఒకరోజు పూర్ణిమ వంటపనిలో ఉంది. పిల్లలిద్దరూ స్కూలుకెళ్ళారు. శివకుమార్ భోజనానికి వచ్చి డైనింగ్ టేబిల్ ముందు కూర్చుంటూ ఉండగా ఫోన్ మోగింది. లేచి వెళ్ళాడు శివకుమార్. ఖంగారుగా మాట్లాడి ఫోన్ పెట్టేశాడు.

"పూర్ణిమా ఓసారి ఇలా రా" అంటూ పూర్ణిమ రాకుండానే తనే ఆమె దగ్గరికి వచ్చేశాడు. "పూర్ణా త్వరగా బయలుదేరు హాస్పటల్‌కి వెళ్ళాలి"

"ఎందుకు! ఎవరు ఫోన్ చేశారు?"

"సూర్యముఖిగారి ఇంటి మీద నిన్న ఇన్‌కంటాక్సువారు దాడి చేశారట. లెక్కల్లోకి రాని బంగారం, కరెన్సీ చాలా పట్టుకుపోయారట. ఈ అవమానం భరించలేని సూర్యముఖి భర్త ధనరాజు ఆత్మహత్యకి ప్రయత్నించాడట! ఇలా అని ఆమె స్నేహితురాలెవరో ఫోన్ చేశారు. ఆయన చాలా ప్రమాద స్థితిలో ఉన్నారట. మనని చూడాలని కలవరిస్తున్నాడట. పద పోదాం."

శివకుమార్ త్వరగా బట్టలు మార్చుకుని స్కూటర్ బయటకు తీశాడు.

పూర్ణిమకి కాళ్ళూ చేతులూ ఆడటంలేదు. ఎలాగో ఇల్లు తాళం వేసి బయలుదేరింది.

హాస్పటల్‌కి వెళ్ళారు.

సూర్యముఖి ఏడ్చి ఏడ్చి పిచ్చిదానిలా చూస్తూ కూర్చుంది. పని మనుషులూ, డ్రైవరూ తప్ప మరెవరూ లేరు అక్కడ. పూర్ణిమని చూస్తూనే బోరుమంది సూర్యముఖి.

శివకుమార్ ఆమెని ఓదార్చి సూర్యముఖి భర్త దగ్గరగా వెళ్ళాడు.

నర్సు చెప్పింది మీరు చూడాలనుకున్న శివకుమార్‌గారు వచ్చారు. కళ్ళు తెరవండి" అని రెండు సార్లు పిల్చిన తర్వాత ధనరాజు కాస్త కదిలాడు. మెళ్ళిగా కళ్ళు తెరిచాడు చాలా కష్టం మీద.

శివకుమార్ స్నేహపూర్వకంగా పలకరించాడు.

"ఎలా ఉన్నారు?"

"కూర్చోండి" ఆయన స్వరం చాలా మెల్లిగా వినిపించింది.

శివకుమార్ కూర్చున్నాడు. ఆయన అందగాడు కాదు కానీ సౌమ్యుడిలా కన్పిస్తున్నాడు. కాస్త పొట్టిగా సన్నగా ఉన్నాడు. మింగిన నిద్ర మాత్రలని కక్కించి డాక్టర్‌లు జాగ్రత్తగా చూస్తున్నారు ఆయన్ని.

"శివకుమార్" అంటూ తన చేతిలోకి అతని చేతిని తీసుకున్నాడు."మిమ్మల్ని చూడాలని చాలా సార్లు అనుకున్నాను. సూర్యముఖి పడనీయలేదు. మీరు ఆమెని పెళ్ళి చూపులకు చూశారుట. మీ పెళ్ళి ఏ కారణంగా తప్పినా మీరు చాలా అదృష్టవంతులు శివకుమార్. కనుకనే పూర్ణిమా లాంటి ఇల్లాలు దొరికింది. మీ ఇల్లు స్వర్గంలా మలుచుకున్నారు మీరిద్దరూ. నేను సూర్యముఖి అందాన్ని చూశాను. కానీ ఆ అందమైన శరీరంలో ఉన్న గిల్టు మనసుని చూడలేకపోయాను. ఆ గిల్టు మనసు కోరే అతి కోరికలని తీర్చలేక అలిసిపోయాను. కోటీశ్వరురాలు కావాలన్న ఆమె కోరికను తీర్చాలనే పరుగులో మంచి చెడ్డలు మర్చిపోయాను. కుప్పకూలిపోయాను. ప్రభుత్వానికి పట్టుబడ్డాను. ఇదీ ఇప్పటి నా స్థితి." ఆయన ఇంకేం మాట్లాడలేకపోయాడు. మళ్ళీ మగతలోకి వెళ్ళిపోయాడు.

ఆయన బ్రతుకుతాడా, లేదా అన్నది కాదు సూర్యముఖి సమస్య. ప్రాణప్రదంగా పోగు చేసుకున్న డబ్బు పోయిందే అన్న దుఃఖం ఆమెది. ఆమెను ఎలా ఓదార్చాలో తెలియటంలేదు పూర్ణిమకి.

"పూర్ణిమా! నా డబ్బు...నా డబ్బు పోయింది. పోయింది" అంటూ పిచ్చిదానిలా అరుస్తున్న సూర్యముఖిని పొదివి పట్టుకుంది.

"సూర్యం! నువ్వు ఆలోచించవలసింది డబ్బు కోసం కాదు. నీ భర్త కోసం. అతను ఎలాగైనా కోలుకునేలా చేయమని దేవుడిని ప్రార్థించు. ఆయన దగ్గరగా వెళ్ళి కూర్చో. ఆయనకి నువ్వు ధైర్యం చెప్పాలి. అప్పుడు గానీ అతను కోలుకోడు" అంటూ బలవంతంగా తీసుకువెళ్ళాలని ప్రయత్నించింది. సూర్యముఖి లేవలేదు. 'డబ్బు డబ్బు' అంటూ ఏడవసాగింది.

"పూర్ణిమా! నేను ఈయన్ని చూసుకుంటాను. నువ్వు ఆమెని మనింటికి తీసుకెళ్ళు. ఆవిడని ఒంటరిగా వదలకు. ఒకటి రెండు రోజులకి గానీ ఆవిడకి మనః స్థిమితం రాదు."

శివకుమార్ అలా చెప్పగానే ఇద్దరు నర్సుల సాయంతో సూర్యముఖిని ఎలాగో కారు ఎక్కించి ఇంటికి తీసుకువచ్చింది.

రెండు రోజులు గడిచిపోయాయి.

సూర్యముఖి కాస్త స్థిమితపడింది.

"పూర్ణా! నీ ఇంట్లో రెండు రోజులు ఉన్న తర్వాత గానీ నేను ఏం పోగొట్టుకున్నానో అర్థం కాలేదు. నేను హాస్పటల్‌కి వెడతాను. ఆయన్ని ఇంటికి తీసుకువెడతాను" అంది.

కన్నీళ్ళు తుడుచుకుంటూ లేచి బయలుదేరింది.

"పూర్ణా! మరెప్పుడు నా స్థితి కంటే పై స్థితిలో ఉన్నవారిని చూస్తూ అంతస్తులందుకోవాలని వెర్రి తాపత్రయం పడను. శాంతిని పోగొట్టుకోను. వస్తాను" అంటూ వెళ్ళిపోయింది.

పూర్ణిమ సంతోషానికి అవధులు లేవు.

శివకుమార్ హాస్పటల్ నుంచి ఇంటికి వచ్చేశాడు. వస్తూనే భార్యని దగ్గరగా తీసుకున్నాడు.

"పూర్ణా! ధనరాజు నన్ను అదృష్టవంతుడన్నాడు. ఈ అదృష్టం నాకెలా వచ్చింది! పెళ్ళి అయిన కొత్తలో డబ్బుకి ఇబ్బందుల్లో ఉన్న నేను ఓసారి లంచం తీసుకోబోతుంటే నువ్వు మందలించి, నీ మెడలో మీవాళ్ళు పెట్టిన గొలుసిచ్చావు గుర్తుందా? ఆ చిన్న సలహా, సహకారం నన్ను సరైన దారిలో నడిపిస్తూ ఉంది. ఇందుకు నేను నీకు థాంక్స్ చెప్పాలి. అర్ధాంగి అంటే అనుక్షణం భర్తని అర్థం చేసుకుని సరైన దారిలో నడిపించగలిగిన స్త్రీ అని నా ఉద్దేశ్యం. నువ్వేమంటావు?"

"నిజం అంటాను" అంటున్న పూర్ణిమని దగ్గరగా లాక్కున్నాడు శివకుమార్. ★

*

